TGTEL/26/A4985

ఆదాబ్ సైబరాబాద్

ADAAB CYBERABAD

ఎడిటర్ : శివ కుమార్ బిఎస్ | సంపుటి : 1 | సంచిక : 02 | సోమవారం, జూన్ 15, 2026 , | పేజీలు - 4 | వెల: 5/-

వర్షాల నేపథ్యంలో
అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్, జూన్ 14: వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ప్రకృతి విపత్తులపై సమన్వయంగా పనిచేయాలని ఆదేశించారు. (ఆదివారం) హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో వర్షాలు, ప్రకృతి విపత్తులపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షత వహించారు.రాష్ట్రంలో వర్షాకాల పరిస్థితులు, వరద ముప్పు, పట్టణాలు, గ్రామాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇరిగేషన్, వ్యవసాయం, ఆర్ అండ్ బీ, జలమండలి వంటి విభాగాల ఉన్నతాధికారులు కూడా పాల్గొని తమ శాఖల సిద్ధతపై వివరాలు అందించారు. ఈ సమావేశంలో వరదల నివారణ, డ్రైనేజ్ వ్యవస్థ మెరుగుదల, అత్యవసర సేవల సమన్వయం, ప్రజల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం సమగ్ర మార్గదర్శకాలు ఇచ్చారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు, ఎప్పటికప్పుడు అప్రమత్తత అవసరమని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు. రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ. రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్ హాజరయ్యారు. సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఆర్వీ కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి కూడా హాజరయ్యారు. పోలీస్ శాఖ నుంచి సజ్జనార్, రమేశ్ రెడ్డి, సుమతి వంటి పోలీస్ కమిషనర్లు పాల్గొన్నారు. అలాగే హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు.

సింగరేణి కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా
మాట్లాడుతున్నారు

- సింగరేణిపై చేస్తున్న ఆరోపణలతో తన మనసు కలచి వేసిందని
- సింగరేణిపై కొంతమంది అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు
- మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ జీఎల్‌పీల సమావేశం నిర్వహించారు.
- రాజకీయాల కోసం, స్వార్థం కోసం హితవు పలికారు.

మంచిర్యాల, జూన్ 14 : బొగ్గు నిల్వలు మాయమైనట్లుగా ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో శ్రీరాంపూర్ ఓసీపీ వద్ద సింగరేణి అధికారులతో కలిసి ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని (ఆదివారం) ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు పర్యటించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. సింగరేణి కార్మికుడి శ్రమ, చెమటను, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కొందరు మాట్లాడుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.సింగరేణిపై చేస్తున్న ఆరోపణలతో తన మనసు కలచి వేసిందని.. అందుకే అధికారులతో కలిసి ఓపెన్‌హౌస్ కార్యక్రమం ఏర్పాటు చేశామని వివరించారు. మీ రాజకీయాల కోసం, స్వార్థం కోసం తెలంగాణ భవిష్యత్తు అయిన సింగరేణిని అపహాస్యం చేయొద్దని హితవు పలికారు. బొగ్గును వెలికి తీసిన తర్వాత గ్రేడ్‌ల వారీగా స్టాక్ పెడతామని వివరించారు. నిల్వలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని వివరించారు. బొగ్గు తరలించే వాహనాలకు జీపీఎస్ సైతం ఉంటుందని స్పష్టం చేశారు. వీజలెన్స్ మానిటరింగ్ కూడా ఉంటుందని చెప్పుకొచ్చారు. కిలో బొగ్గు బయటకు వెళ్లే అవకాశం లేదని తేల్చిచెప్పారు.అసలైన ఓటర్లను తొలగించే కుట్ర జరుగుతోంది: మల్లు భట్టి విక్రమార్కఎస్ఐఆర్‌ను అడ్డంపెట్టుకొని అసలైన ఓటర్లను తొలగించే కుట్ర జరుగుతోందని మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ఓటు లేకపోతే పౌరసత్వానికి ప్రమాదం ఏర్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ బీఎల్‌ఏల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావ్, ఎమ్మెల్సీ వినోద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. కాంగ్రెస్ మద్దతు తెలిపే వారిని ఏఐ టెక్నాలజీతో లిస్టు జెట్ చేస్తున్నారని.. వారందరిని హోల్డ్‌లో పెడుతున్నారని తెలిపారు. బీజేపీ నేతలు చాలా షాప్స్‌గా ఓట్ల తొలగిస్తున్నారని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం అయ్యే సమయంలో గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని.. కానీ అలా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఓటర్ల మ్యాపింగ్ కాలేదని 80 వేల మందిని అన్ మ్యాపింగ్ చేశారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

నన్ను తరిమికొట్టే వ్యక్తి
ఈ గడ్డ మీద పుట్టలేదు

హైదరాబాద్, జూన్15: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి మరోసారి మండిపడ్డారు. ఆదివారం హైదరాబాద్‌లోని అంబర్ పేటలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రో రైలుకు కేంద్రం నిధులు ఇచ్చిందన్నారు. మెట్రోకు నగదు ఇవ్వకుండే తాము రాజీనామా చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయని మీరు రాజీనామా చేస్తారా? అంటూ సీఎం రేవంత్ రెడ్డిని కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. తనను తరిమికొడతామని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని గుర్తు చేశారు.అయితే తాను బీఆర్ఎస్ కార్యకర్తను కాదు.. బీజేపీ కార్యకర్తనని తెలిపారు. తనను తరిమికొట్టే వ్యక్తి ఈ గడ్డ మీద ఇంకా పుట్టలేదని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ బిడ్డలను కాంగ్రెస్ పార్టీ మెన్నుపోటు పొడిచిందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఎవరు రాజీనామా చేస్తారో చెప్పాలంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిలను ఆయన డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఆట మొదలు పెట్టారని.. 2028లో ఈ ఆటను బీజేపీ ముగిస్తుందన్నారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని బీజేపీ సీనియర్ నేత,కుందబద్దల కొట్టారు.

రాజీనామా చేసిన అంగన్వాడీ టీచర్లు,
మళ్లీ ఉద్యోగాల్లోకి

హైదరాబాద్, జూన్14:తెలంగాణలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల సంక్షే మానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గత కొన్ని నెలల కిందట రాష్ట్రంలో గ్రామ పంచాయతీ, మున్సి పల్ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఎన్నికల్లో చాలా మంది పోటీలో నిలిచారు. కానీ అందులో కొందరే గెలిచి.. పదవులను చేపట్టగా.. మిగిలిన వారు ఓటమి పాలయ్యారు. ఈ క్రమంలోనే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు.. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉండ కూడదు అనే నిబంధన ఉంది. అందుకే తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి మరీ కొందరు ఎన్నికల్లో బరిలో దిగుతూ ఉంటారు. ఎన్నికల్లో ఓడిపోతే అటు పదవిపోతోపాటు.. ఇటు ప్రభుత్వ ఉద్యోగం కూడా పోతుంది.ఈ క్రమంలోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి.. ఓడిపోయిన అంగన్వాడీ సిబ్బందికి.. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క గుడ్‌న్యూస్ చెప్పారు. వారిని పునర్నియమించేందుకు అవకాశం కల్పించనున్నారు. మంత్రి సీతక్క చొరవతో అర్హులైన వారు విధుల్లోకి తిరిగి వచ్చేందుకు మార్గం సుగమం అయింది. రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల పునర్నియామక ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికి సంబంధించి.. తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.అయితే రాజీనామా చేసిన అంగన్వాడీ టీచర్, హెల్పర్ స్థానంలో.. ఇప్పటివరకు ఇంకో అభ్యర్థిని నియమించని ప్రాంతాల్లో మాత్రమే తిరిగి పాత వారిని నియమించుకునేందుకు అవకాశం కల్పించను న్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ మేరకు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ ఉత్తర్వులు వెలువరించారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, సిబ్బంది సంక్షేమానికి రేవంత్ రెడ్డి సర్కార్ అధిక ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అర్హులైన అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల నుంచి అభ్యర్థనలతోపాటు.. రూల్స్ ప్రకారం వెంటనే వాటిని పరిశీలించి వారిని మంత్రి చెప్పారు. దీంతో రాజీనామా చేసిన అంగన్వాడీ సిబ్బందిలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

బాకీతో సహా మొత్తం ఆడబిడ్డలకు ఇయ్..
నేను రాజీనామా చేస్తా

రేవంత్ రెడ్డి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తా అంటుండు.. నువ్వు కోటీశ్వరులను చేసుడు దేవుడెరుగు.. నువ్వు ముందైతే లక్షాధికారులు చెయ్. ఒక్కొక్క ఆడబిడ్డకు లక్షా 50 వేలు ఇస్తా అని చెప్పినవ్ కదా.. నువ్వు కోటి మంది ఆడబిడ్డకు ఇస్తే నేను రాజీనామా చేసి పోతా అని రేవంత్ రెడ్డికి చెబుతున్నానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.తెలంగాణ భవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి కేటీఆర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ దానోజు శ్రవణ్ కుమార్, పార్టీకి చెందిన ముఖ్యనేతలు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎస్ఐఆర్, పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియపై దిశానిర్దేశం చేయనున్నారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..రేవంత్ రెడ్డి బాధల్లా మన పదవులు కావాలనే కదా.. మనముండొద్దు రాజకీయంలో పక్కకు పోవాలనే కదా.. ఆడబిడ్డలకు పోయిన రెండున్నరేళ్ళ వచ్చే రెండున్నరేళ్లు బాకీతో సహా ఒక్కొక్కరికి రూ. లక్షా 50 వేల చొప్పున మొత్తం ఆడబిడ్డలకు ఇయ్.. నేను రాజీనామా చేస్తా.. అట్లగే మా తమ్ముళ్లకు రూ. 4వేలు నిరుద్యోగ భృతి ఇస్తా అని చెప్పినవ్ కదా.. పోయిన రెండున్నర సంవత్సరాలు, మొత్తం కలిపి 40 లక్షల మంది మా తమ్ముళ్లకు, చెల్లెళ్లకు ఇయ్.. తప్పకుండా రాజకీయమే వదిలేస్తా అని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు.మళ్లీ 2028లో కూడా గులాబీ జెండా ఎగరేద్దామా.. ?మోచేతికి బెల్లం పెట్టిండు. ఆగం చేసిండు.. పోయి కుర్చీల కూర్చున్నడు. హైదరాబాదోళ్లు, ఖైరతాబాద్‌లో ఒక్కడు కూడా కాంగ్రెస్ పార్టీని నమ్మలేడు. మీరు కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా ఇయ్యలేదు. మీరేమన్నా నాగేందర్‌కు ఓటేశారా.. మీరంతా కేసీఆర్‌కు వేశారు. మాకు తెలుసనన్నారు. నాగేందర్‌ను చూసి ఓటేస్తే మొత్తం నాకేస్తుడు.. తెల్వదా మనకు.. అన్నట్టే నాకేసిండు.

రాజ్యసభలో 2/3 మెజారిటీ దిశగా ఎన్‌డీఏ
మరి లోక్‌సభ మాటేమిటి

బంగాల్: తృణమూల్ కాంగ్రెస్‌లో మొదలైన తిరుగుబాటు, కేంద్రంలోని అధికార ఎన్‌డీఏ కూటమికి పార్లమెంట్‌లో కలిసిరానుంది. కీలకమైన రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదించుకోవడానికి అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ సాధన దిశగా ఎన్‌డీఏ అడుగులు వేస్తోంది. తాజాగా జరిగిన రాజ్యసభ ఎన్నికలు, టీఎంసీ ఎంపీల రాజీనామాలతో ఎగువ సభలో ఎన్‌డీఏ బలం పెరిగి మూడింట రెండొంతుల మెజార్టీకి చేరువైంది. లోక్‌సభలో మాత్రం ఆ మ్యాజిక్ ఫిగర్‌కు ఎన్‌డీఏ కూటమి ఇంకా దూరంలోనే ఉంది.

టీఎంసీలో లాల్చి టీజేపీకి కలిసొస్తుందాపార్టమెంటు ఉభయ సభల్లోనూ మూడింట రెండొంతుల మెజారిటీని సాధించేందుకు ప్రయత్నిస్తున్న ఎన్‌డీఏకు, టీఎంసీలో తలెత్తిన అంతర్గత తిరుగుబాటు బలాన్ని చేకూర్చే అవకాశం ఉంది. రాజ్యసభలో ప్రస్తుతం ఎన్‌డీఏ బలం 148 కాగా, ఝార్ఖండ్, మిజోరాంలో స్వతంత్ర స్థానాల ఎన్నికల ద్వారా మరో మూడు సీట్లు కూటమి ఖాతాలో పడనున్నాయి. దీనికి తోడు, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు రాజ్యసభ ఎంపీలు రాజీనామా చేయడంతో, బంగాల్ ఉపఎన్నికల తర్వాత ఆ మూడు స్థానాలను కూడా ఎన్‌డీఏ గెలుచుకోనుంది. దీంతో ఎగువ సభలో ఎన్‌డీఏ బలం 154కి చేరనుంది. రాజ్యసభలో మూడింట రెండొంతుల మెజారిటీ

సాధించాలంటే 163 స్థానాలు ఉండాలి. దీనికి ఎన్‌డీఏ కూటమి కేవలం 9 స్థానాల దూరంలోనే ఉంటుంది. రానున్న రోజుల్లో మరికొందరు టీఎంసీ ఎంపీలు (సుమారు 20 మంది) రాజీనామా చేసే అవకాశం ఉంది. ఈ కారణంగా ఎన్‌డీఏ సులభంగానే 163 మార్కును దాటి, కీలక బిల్లుల ఆమోదానికి అవసరమైన సంఖ్యబలాన్ని సాధించే అవకాశం ఉందని రాజకీయ పర్యాలు భావిస్తున్నాయి.

ప్రపంచ సమస్యలకు పరిష్కారాలను అందించే స్థాయికి భారత్ఎదిగింది

న్యూ ఢిల్లీ :భారత్ కేవలం తన సుస్థిర భవిష్యత్తు కోసమే కాకుండా ప్రపంచం కోసం సరికొత్త అవిష్కరణలు చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇతరులు కనుగొన్న పరిష్కారాలను వాడుకునే దేశంగా మాత్రమే భారత్ మిగిలిపోలేదని, ప్రపంచ సమస్యలకు పరిష్కారాలను అందించే స్థాయికి ఎదిగిందని స్పష్టం చేశారు. ఫ్రాన్స్‌లో జరిగిన ప్రతిష్టాత్మక 'భారత్ ఇన్నోవేట్' సదస్సులో ఆ దేశ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో కలిసి మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ఉన్న బంధాన్ని, సాంకేతిక రంగంలో భారత్ సాధిస్తున్న ప్రగతిని ప్రధాని మోదీ కొనియాడారు.“అవిష్కరణ అనేది భారతదేశ డీఎన్ఏలోనే ఉంది. వేల సంవత్సరాలుగా భారత్ తన జ్ఞానం, నూతన అవిష్కరణల ద్వారా ప్రపంచానికి సరికొత్త దిశను చూపిస్తూ వస్తోంది. గణితం నుంచి ఖగోళ శాస్త్రం వరకు,వారసత్వానికి సరికొత్త వేగాన్ని, సరికొత్త దిశను అందించాం.

'సర్' పేరుతో మోదీ సర్కార్ ప్రతిపక్షాల
ఓట్లు తీసేస్తోంది.

హనుమకొండ, జూన్ 14 : కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం 'సర్' పేరుతో ప్రతిపక్షాల ఓట్లు తీసేస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సర్'పై మనం అప్రమత్తంగా ఉంటే ఏం కాదని చెప్పుకొచ్చారు. (ఆదివారం) హనుమకొండలో హరీశ్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ. 'సర్'పై కార్యకర్తల కు అవగాహన కల్పించారు. 'సర్' పై చాలా జాగ్రత్తగా ఉంటేనే గ్రేటర్ వరంగల్ ఎన్నికల్లో విజయం సాధిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పోవాలే.. కేసీఆర్ అధికారంలోకి రావాలని జనం అంటున్నారని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు. చట్టాలు, పోలీసులు చేయలేని పనిని కల్యాణలక్ష్మితో కేసీఆర్ చేశారని ప్రస్తావించారు. కల్యాణలక్ష్మితో బాల్య వివాహాలు ఆగిపోయాయని తెలిపారు. కేసీఆర్ సంక్షేమ పథకాల వెనక ఒక విజన్ ఉందని ఉద్ఘాటించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ దుర్మార్గాలపై రెండున్నరేళ్లుగా కొట్లాడుతున్నామని తెలిపారు. కార్యకర్తలు అండదండలతోనే హైడ్రాలాంటి అరాచకాలపై పోరాడుతున్నామని చెప్పారు. పార్టీ కార్యకర్తల పిల్లల కోసం పుస్తకాలను పార్టీ నేతలు పంపిణీ చేయడం సంతోషకరమని హరీశ్‌రావు పేర్కొన్నారు.

ఎస్ఐఆర్, బీఎల్ఏల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలి: కాంగ్రెస్ నాయకత్వం

- జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్

ఆదాబ్ సైబరాబాద్, కుత్బుల్లాపూర్ : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ఎఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో కరీంనగర్, పెద్దపల్లి, అదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని కాంగ్రెస్ ముఖ్య నాయకులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్, మాజీ శాసనసభ్యుడు కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలతో పాటు ఎస్ఐఆర్, బీఎల్ఏల అవగాహన, శిక్షణ సదస్సుల నిర్వహణ, సంఘటన్ సృజన్ అభియాన్ (ఎస్ఎస్ఏ) కమిటీల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని నాయకత్వం సూచించింది. పార్లమెంట్ కోఆర్డినేటర్లు, శాసనసభ్యులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, అసెంబ్లీ కోఆర్డినేటర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో ఈ అంశాలపై విస్తృతంగా చర్చించారు.త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల సంఘం చేపట్టనున్న ప్రత్యేక కార్యక్రమాల నేపథ్యంలో బూత్ స్థాయి ఏజెంట్లు, బీఎల్ఓలతో సమన్వయం పెంచి ఓటరు జాబితాల్లోని నకిలీ ఓట్ల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని, అధికారులతో సమర్థవంతమైన సమన్వయం కొనసాగించాలని నాయకత్వం సూచించింది.సమావేశంలో కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎస్ఐఆర్, బీఎల్ఏల నియామకాలు, ఎస్ఎస్ఏ కమిటీల ఏర్పాటు ప్రక్రియ పురోగతిని ఎఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, డీసీసీ అధ్యక్షులు, పార్లమెంట్ కోఆర్డినేటర్లు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాధికార సమరభేరి సభ విజయవంతానికి పోచంపల్లిలో అవగాహన కార్యక్రమం

- బీసీల హక్కుల సాధనకు ప్రజలు చైతన్యంతో ముందుకు రావాలి: నీరజా గౌడ్

ఆదాబ్ సైబరాబాద్, పోచంపల్లి : రానున్న జూలై 5న భువనగిరిలో నిర్వహించనున్న "రాజ్యాధికార సమరభేరి" సభను విజయవంతం చేయాలనే లక్ష్యంతో పోచంపల్లి మండలంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కార్యకులు, ప్రజలను ప్రత్యక్షంగా కలిసి సభ ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ నీరజా గౌడ్ పాల్గొని గ్రామాల్లో పర్యటించారు. కార్యకులు, మహిళలు, సాధారణ ప్రజలను కలుసుకుని బీసీల హక్కులు, సామాజిక న్యాయం, రాజ్యాధికార సాధన లక్ష్యాలతో నిర్వహిస్తున్న ఈ సభ యొక్క ముఖ్య ఉద్దేశాలను వివరించారు. సందర్భంగా నీరజా గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో జరగనున్న రాజ్యాధికార సమరభేరి సభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీలకు రాజకీయ, సామాజిక న్యాయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ చైతన్యవంతులై ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు.రాజ్యాధికార సమరభేరి సభ బీసీల హక్కుల సాధన దిశగా ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని అమె పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ఈ సభ విజయవంతమవ్రతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో చేనేత్ల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు షాలిని, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్ల వాసుదేవ్‌తో పాటు స్థానిక నాయకులు, మహిళలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద పార్కు అభివృద్ధికి నిధులు కేటాయించాలి: ఆకుల సతీష్

పూర్తికాని స్విమ్మింగ్ పూల్ పనులు పూర్తి చేయాలని డిమాండ్

ఆదాబ్ సైబరాబాద్, సైబరాబాద్ : ప్రగతి నగర్‌లోని స్వామి వివేకానంద పార్కును తక్షణమే అభివృద్ధి చేసి ప్రజా వినియోగంలోకి తీసుకురావాలని సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. ప్రగతి సెంట్రల్ స్కూల్ సమీపంలోని సర్వే నంబర్లు 178, 179లో మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పార్కుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆయన కోరారు.అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలతో కలిసి పార్కులోని వాకింగ్ ట్రాక్‌ను శ్రమదానం ద్వారా శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కులో ఉన్న అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించి, దాదాపు 90 శాతం పూర్తయిన స్విమ్మింగ్ పూల్ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.సహజసిద్ధమైన కొండలు, పెద్ద వృక్షాలతో ఈ పార్కు ప్రగతి నగర్ ప్రాంత ప్రజలకు విలువైన పర్యావరణ సంపదగా నిలుస్తోందని ఆకుల సతీష్ పేర్కొన్నారు. పార్కును అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం, వినోద సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు.పార్కు అభివృద్ధికి ప్రభుత్వం, సంబంధిత అధికారులు ప్రత్యేక నిధులు కేటాయించి పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్థానిక ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అరుణ్ రాపు, చందు, పి.వి. శ్రీనివాస్, ఎల్ల స్వామి, మురళీకృష్ణ, కృష్ణ, కిషోర్, వెంకట్రాపు, రాజిరెడ్డి, రమణ, రాము తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి తహసీల్దార్ సంతకం ఫోర్జరీ.. నలుగురు అరెస్టు

జగిత్యాల ఏకంగా మెట్‌పల్లి తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. నకిలీ ముద్రలతో తప్పుడు పత్రాలను సృష్టించి, భూమిని చేరే వారికి రిజిస్ట్రేషన్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి పట్టనంలోని ఆరపేట వార్డు శివారులోని సర్వే నంబర్ 191 భూమికి సంబంధించిన నకిలీ ఆబాది సర్టిఫికెట్ తయారు చేశారు. ఇందుకోసం మెట్‌పల్లి తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేయడమే కాకుండా, ప్రభుత్వ కార్యాలయాల ముద్రలను పోలిన నకిలీ స్టాంపులను తయారు చేశారు. వాటి సాయంతో సర్వే నంబర్ 191 భూమిని ఇతరుల పేరు మీదకు రిజిస్ట్రేషన్ చేయించారు.నకిలీ పత్రాల ఆధారంగా భూమిని రిజిస్ట్రేషన్ చేసినట్లుగా బయటపడటంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నేరం రుజువు కావడంతో తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి, నకలీ స్టాంపులతో ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించిన రాజులదేవి సర్పయ్య, కలికోట వేణు, గోలపు గణేశ్, పాకాల రాజేశ్‌లను మెట్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి కంప్యూటర్ పరికరాలు, రబ్బర్ స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో బెజ్జారపు మధుసూదన్, అంగారి శంకర్ పరారీలో ఉన్నట్లు సమాచారం. పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ పత్రాలను ఫోర్జరీ చేసి అక్రమ లావాదేవీలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు..

బీజేపీ సీనియర్ నాయకుడు ఆర్మనపల్లి సూర్యరావుకు ఘన జన్మదిన వేడుకలు

- కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో శాలువాతో సన్మానం

ఆదాబ్ సైబరాబాద్, కూకట్‌పల్లి : రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకుడు ఆర్మనపల్లి సూర్యరావు జన్మదిన వేడుకలు కూకట్‌పల్లి భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సూర్యరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని ఆర్మనపల్లి సూర్యరావును శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం పుష్పవృష్టాన్ని అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ఆర్మనపల్లి సూర్యరావు అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ మాధవరం కాంతారావు, బీజేపీ సీనియర్ నాయకులు నాయినేని సూర్యప్రకాశ్‌రావు, ఆకుల వెంకటస్వామి, జిల్లా కార్యదర్శి యంజాల పద్మయ్యతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఆర్మనపల్లి సూర్యరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్ఓసీని బాధిత కుటుంబానికి అందజేసిన కూన శ్రీశైలం గౌడ్

- ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలి

ఆదాబ్ సైబరాబాద్ : కుత్బుల్లాపూర్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని 290వ డివిజన్ సుభాష్‌నగర్‌లోని ఎన్ఆర్ నాయక్‌నగర్‌కు చెందిన వెంకటమణి కుమార్ అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.3 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) కాపీని మాజీ శాసనసభ్యుడు కూన శ్రీశైలం గౌడ్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.ప్రజలకు అవసరమైన ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ బొబ్బా రంగారావు, మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాసరెడ్డి, కూన రాఘవేంద్ర గౌడ్, ప్రభాకర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, సాంబశివరావుతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లంపేటలో 46వ ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించిన బొంగునూరి కిషోర్ రెడ్డి

- ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

ఆదాబ్ సైబరాబాద్, కుత్బుల్లాపూర్ : నియోజకవర్గ పరిధిలోని మల్లంపేట పోచమ్మ ఆలయం సమీపంలో నిర్వహించిన 46వ ఉచిత వైద్య శిబిరాన్ని తెలంగాణ స్టేట్ ప్రొటోకాల్ అండ్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా వైద్య శిబిరంలో అందిస్తున్న సేవలను పరిశీలించిన ఆయన, వైద్య సిబ్బందితో మాట్లాడి శిబిరం నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మల్లంపేట కాలనీ ప్రజలు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. సాధారణ ప్రజలకు వైద్య పరీక్షలు, సలహాలు అందుబాటులోకి రావడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కావలి గణేష్, పద్మారావు, మనోజ్ రెడ్డి, రేవంత్ రెడ్డి, గురవారెడ్డి, హరి, శ్రీనిధి, వాణితో పాటు మల్లంపేట కాలనీ వాసులు పాల్గొన్నారు.

విశ్వకర్మలకు కమ్యూనిటీ హాల్ నిర్మించాలి: దరువు అంజన్న

- ఎమ్మెల్యే వివేకానంద హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి

ఆదాబ్ సైబరాబాద్, కుత్బుల్లాపూర్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో వేలాది మంది విశ్వకర్మలు నివసిస్తున్నప్పటికీ వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని తెలంగాణ ప్రభుత్వ టూరిజం, సాంస్కృతిక శాఖ సలహాదారు దరువు అంజన్న అన్నారు. విశ్వకర్మలకు ప్రత్యేక కమ్యూనిటీ హాల్ నిర్మించి, వారి అవసరాలకు తగిన సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు. సూరారంలోని విశ్వకర్మ కాలనీలో నిర్వహించిన శ్రీ విరాట్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ద్వితీయ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దరువు అంజన్న ఈ సందర్భంగా మాట్లాడారు. రాజకీయ పార్టీలు విశ్వకర్మల ఓట్లను మాత్రమే ఆశిస్తున్నాయని, అయితే వారి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. గతంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద జగద్గిరిగుట్ట ప్రాంతంలో విశ్వకర్మలకు కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని, కైతలాపూర్ ప్రాంతంలో స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. అయితే ఆ హామీలు ఇప్పటికీ అమలు కాలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా విశ్వకర్మలను చిన్నచూపు చూడకుండా వారికి స్థలం కేటాయించి కమ్యూనిటీ హాల్ నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. విశ్వకర్మల సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యేక వేదిక అవసరమని అన్నారు. అనంతరం శ్రీ విరాట్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ విరాట్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు పొలిగారం కృష్ణమాచారి, ప్రెసిడెంట్ కమ్మరి లక్ష్మణాచారి, ఎన్ఆర్ నాయక్‌నగర్ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఆలారి శేషాచారి తదితరులు పాల్గొన్నారు.

ఈరోజు విద్యుత్ సరఫరాకు అంతరాయం

- చెట్ల కొమ్మల తొలగింపు కారణం
- దుండిగల్ ప్రాంతాల్లో నిలిపివేత

ఆదాబ్ సైబరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి : దుండిగల్ 33 కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ రోజు పలు ప్రాంతాల్లో తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వివిధ 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడనుంది. ఎఫ్-2 ఫీడర్ పరిధిలో గాగిల్లాపూర్ ఎక్స్ రోడ్, చర్చ్ ప్రాంతం, పారిశ్రామిక ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. చైతన్య కాలనీ ఫీడర్ పరిధిలో చైతన్య కాలనీ, ఏపీఆర్ గ్రూప్, గాగిల్లాపూర్ గ్రామానికి విద్యుత్ సరఫరా ఉండదు. అలాగే విర్చో ఫీడర్ పరిధిలో గాగిల్లాపూర్ పారిశ్రామిక ప్రాంతంలో విద్యుత్ అంతరాయం ఏర్పడనుంది. తండా ఫీడర్ పరిధిలో తండా-1, తండా-2 ప్రాంతాలు, సుందర్ ఆశ్రమ్ ఫీడర్ పరిధిలో దుండిగల్ గ్రామం మరియు పరిసర కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. రామ్‌కీ ఫీడర్, బీహెచ్‌ఈఎల్ ఫీడర్, గండిమైసమ్మ ఫీడర్, సరోగూడెం ఫీడర్, బౌరంపేట్ వ్యవసాయ ఫీడర్ పరిధిలో కూడా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. గండిమైసమ్మ ఎక్స్ రోడ్, ఆంధ్రా బ్యాంక్ పరిసరాలు, శ్లోకా స్కూల్ ప్రాంతంతో పాటు సరోగూడెం, రాజరాజేశ్వరి కాలనీ ప్రాంతాలు ఈ అంతరాయానికి గురికానున్నాయి. విద్యుత్ నిర్వహణ పనులను దృష్టిలో ఉంచుకుని వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు. తాత్కాలిక అసౌకర్యానికి చింతిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ఏఈ (అవేర్నెస్) డీపల్లి డి. సమ్మయ్య ఒక ప్రకటనలో వెల్లడించారు.

121 సార్లు రక్తదానం చేసిన లింగాల రవికుమార్‌కు ఘన సన్మానం

ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా దిశ లా ఫర్మ్ ఆధ్వర్యంలో రక్తదాతలకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 121 సార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన శ్రీ సాయి ఫేమస్ ఉడిపి టిఫిన్స్ అధినేత లింగాల రవికుమార్, ఆయన సతీమణి వద్దే శాంతి మహేశ్వరిని ప్రముఖ హైకోర్టు న్యాయవాది నాగేశ్వర్ రావు పూజారి సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ రావు పూజారి మాట్లాడుతూ, సమాజంలో రక్తదానంపై అవగాహన పెంచుతూ 121 సార్లు రక్తదానం చేసిన లింగాల రవికుమార్ సేవలు అభినందనీయమని కొనియాడారు. ఆయన చేస్తున్న సేవలు ఎంతోమందికి ప్రాణదాతగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమంలో మాట్లాడిన లింగాల రవికుమార్, రక్తదానం చేయడం అంటే ప్రాణదానం చేయడమేనని అన్నారు. తాను ప్రతి మూడు నెలలకు ఒకసారి క్రమం తప్పకుండా రక్తదానం చేస్తున్నానని తెలిపారు. రక్తదానం వల్ల నీరసం వస్తుందని కొందరిలో ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని, ముఖ్యంగా యువత సామాజిక బాధ్యతగా రక్తదానాన్ని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా లభించిన ఈ గుర్తింపు తమకు మరింత బాధ్యతను పెంచిందని రవికుమార్, శాంతి మహేశ్వరి దంపతులు తెలిపారు. భవిష్యత్తులో కూడా రక్తదాన సేవలను కొనసాగిస్తూ మరింత మందిని ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములను చేయడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

రాజ్యాధికార సమరభేరికి ఆహ్వానం

- కార్మికుల చేతులు అసెంబ్లీలో చట్టాలు చేసే స్థాయికి చేరాలి: పటేల్ వనజక్క

ఆదాబ్ సైబరాబాద్, భువనగిరి : తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జూలై 5న భువనగిరిలో నిర్వహించనున్న "రాజ్యాధికార సమరభేరి" బహిరంగ సభకు సంబంధించి పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క నేతృత్వంలోని బృందం కల్లు గీత కార్మికులను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేసింది. ఈ సందర్భంగా బాలరాజ్ గౌడ్, శివ గౌడ్‌లను మర్యాదపూర్వకంగా కలిసి సభకు హాజరుకావాలని కోరారు. అనంతరం కల్లు గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వారి అభిప్రాయాలు, ఆవేదనలను విన్నారు. ఈ సందర్భంగా పటేల్ వనజక్క మాట్లాడుతూ కల్లు గీసే చేతులు కేవలం (శమకే పరిమితం కాకుండా అసెంబ్లీలో చట్టాలు చేసే స్థాయికి ఎదగాలని అన్నారు. తరతరాలుగా శ్రమిస్తున్న బీసీ వర్గాలు రాజకీయంగా వెనుకబడిపోయాయని, వారి సమస్యలు శాసనసభలో వినిపించాలంటే బీసీలకు రాజ్యాధికారం అవసరమని పేర్కొన్నారు. బీసీ వర్గాల హక్కులు, అవకాశాలు, గౌరవం కోసం అన్ని వర్గాలకు చెందిన బీసీలు ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. సమాజాన్ని నిర్మించే (శమజీవులకు పాలనా వ్యవస్థలో భాగస్వామ్యం కల్పించడమే తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. జూలై 5న భువనగిరిలో జరిగే రాజ్యాధికార సమరభేరి సభకు భారీ సంఖ్యలో హాజరై బీసీల రాజకీయ సాధికారతకు మద్దతు తెలపాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గిరగాని భిక్షపతి గౌడ్, బత్తిని మీన, అర్రబెల్లి పావని, అర్రబెల్లి శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.

బాపునగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అభివృద్ధికి సహకరిస్తాం: ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

- నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భం

ఆదాబ్ సైబరాబాద్, కుత్బుల్లాపూర్ : బాపునగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ ఎల్పీ ఎఫ్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ బాపునగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అభివృద్ధి కార్యక్రమాలకు తన పూర్తి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో కాలనీల అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. గత 12 సంవత్సరాల కాలంలో కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు భారీగా నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామని, రానున్న రోజుల్లో కూడా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. బాపునగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం కాలనీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. జగదీష్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. నుబ్బారావు, (ప్రధాన కార్యదర్శి సిహెచ్. దయానంద్, ఉపాధ్యక్షులు మాల్యాద్రి, బాబురావు, కె.వి. రాజేష్, సంయుక్త కార్యదర్శులు రాజారెడ్డి, రాజు యాదవ్, దత్తాత్రేయ, ఎల్వీసీ రామాంజనేయులు, జైపాల్ రెడ్డి, కోశాధికారి మధుసూదన్, కార్యనిర్వాహక కార్యదర్శులు శ్రీధర్ కుమార్, రవి, లక్ష్మీనా రాయణ గౌడ్, సభ్యులు సత్తిబాబు, శ్రీరామచంద్రమూర్తి, కె.వి. రాజేంద్రప్రసాద్, కె. సరోజ్, శ్రీరామ్, సంపత్ గౌడ్ పాల్గొన్నారు.

టీడబ్ల్యూజేఎఫ్‌పై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు: మామిడి సోమయ్య

- జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడే స్వతంత్ర వేదికే టీడబ్ల్యూజేఎఫ్

ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ పై కొందరు వ్యక్తులు, సంఘ వ్యతిరేక శక్తులు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య ఆరోపించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా టీడబ్ల్యూజేఎఫ్ బలంగా పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే 22 జిల్లాల్లో జిల్లా మహాసభలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. సభ్యత్వ విషయంలో కార్మిక శాఖకు వార్షిక నివేదికలను సమర్పించామని, మిగిలిన జిల్లాల మహాసభలు, రాష్ట్ర మహాసభలను కూడా త్వరలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సంఘానికి సంబంధించిన కొన్ని కోర్టు కేసులు, జర్నలిస్టుల అక్రెడిటేషన్ అంతాలపై న్యాయపరమైన పోరాటాల కారణంగా రాష్ట్ర మహాసభల నిర్వహణలో ఆలస్యం జరిగిందని ఆయన వివరించారు. దీనిని సంఘం బలహీనతగా చిత్రీకరించడం సరికాదన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ తమదేనని, కార్మిక శాఖ గుర్తింపు తమకే వచ్చిందని కొందరు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని సోమయ్య పేర్కొన్నారు. నిజంగా గుర్తింపు పొందినట్లయితే సంబంధిత పత్రాలను బహిరంగపరచేవారని, అలాంటిదేమీ జరగకపోవడం వారి ప్రచారంలో వాస్తవం లేదనే విషయాన్ని స్పష్టం చేస్తోందన్నారు. సంఘం బైలాకు విరుద్ధంగా తనను బహిష్కరించినట్లు ప్రకటించడం, బైలాలో లేని "యాక్టింగ్ (ప్రెసిడెంట్" పదవిని సృష్టించడం వంటి చర్యలతో కొందరు సంఘాన్ని తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవాలని ప్రయత్నించారని ఆరోపించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ పేరును దుర్వినియోగం చేయకుండా, సంఘ బ్యాంకు ఖాతాలను ఇతరులు వినియోగించకుండా సివిల్ కోర్టులో కేసు దాఖలు చేసినట్లు తెలిపారు. అలాగే అక్రెడిటేషన్ కమిటీల్లో జరిగిన అన్యాయంపై హైకోర్టులో మూడు కేసులు దాఖలు చేసినట్లు వెల్లడించారు. కోర్టుల్లో కేసులు కొనసాగుతున్న సమయంలో తమపై బహిష్కరణ ప్రచారం చేయడం న్యాయవ్యవస్థను కించపరచడమేనని పేర్కొన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ ఏ రాజకీయ పార్టీకి, మీడియా సంస్థకు లేదా యాజమాన్యానికి అనుబంధంగా పనిచేయదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, గౌరవం కోసం స్వతంత్ర ట్రేడ్ యూనియన్‌గా పనిచేస్తోందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందే తెలంగాణ జర్నలిస్టుల హక్కులు, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీడబ్ల్యూజేయూ) ఏర్పాటైందని, అదే తర్వాత టీడబ్ల్యూజేఎఫ్‌గా రూపాంతరం చెందిందని సోమయ్య వివరించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జర్నలిస్టులను ఏకం చేస్తూ సంఘం కీలక పాత్ర పోషించిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యం కాని కొందరు వ్యక్తులు రాష్ట్ర ఏర్పాటు తర్వాత సంఘంలో చేరి పదవులు పొందారని, అనంతరం సంఘాన్ని రాజకీయ లేదా మీడియా అనుబంధ సంస్థగా మార్చేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. సంఘ స్వతంత్రతను కాపాడేందుకు తమ పోరాటం కొనసాగుతోందన్నారు. ఎన్ని అవాస్తవ ప్రచారాలు జరిగినా ధర్మం, న్యాయం, చట్టం తమ వైపే ఉన్నాయని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం టీడబ్ల్యూజేఎఫ్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని మామిడి సోమయ్య పేర్కొన్నారు. జర్నలిస్టులు తప్పుడు ప్రచారాలను నమ్మకుండా సంఘం ఐక్యతను బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్

- స్వచ్ఛంద రక్తదానంపై అవగాహన కల్పించాలి: డాక్టర్ పి.వి.వి. ప్రసాద్

ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదర్శనగర్ కాలనీ కమ్యూనిటీ హాలులో ఆదివారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ కన్వీనర్ తాటిబోయిన రామస్వామి యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ మాజీ డైరెక్టర్ డాక్టర్ పి.వి.వి. ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలుమార్లు రక్తదానం చేసిన రక్తదాతలను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. అనంతరం డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తం మానవ శరీరానికి ఇంధనం వంటిదని పేర్కొన్నారు. స్వచ్ఛంద రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి మరింత మందిని రక్తదానానికి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ప్రత్యేక నినాదంతో నిర్వహిస్తుందని, ఈ ఏడాది "మానవత్వపు ఒక చుక్క రక్తదానం చేయండి -- ప్రాణాలను కాపాడండి" అనే నినాదాన్ని ప్రకటించినట్లు తెలిపారు. రక్తదానం ద్వారా ప్రమాదాల్లో గాయపడినవారు, తలసీమియా బాధితులు, ప్రసవ సమయంలో గర్భిణులు, వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగులు ప్రాణాలు నిలబెట్టుకుంటారని చెప్పారు. దేశ జనాభాలో రక్తదానానికి అర్హులైన వారి సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారి సంఖ్య చాలా తక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన ఆరోగ్యవంతులైన స్త్రీ, పురుషులు రక్తదానం చేయవచ్చని, రక్తదానం వల్ల ఆరోగ్యపరమైన ప్రయోజనాలు కూడా ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా సోజిత్ బహుమతి గ్రహీత కార్ల్ ల్యాండ్స్టినర్ సేవలను స్మరించుకున్నారు. మానవ రక్తంలోని రక్తగ్రూపులను కనుగొన్న ఆయన జన్మదినమైన జూన్ 14ను ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాల్గొన్న వారెవో స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహిస్తూ సమాజంలో ఉన్న అపోహలను తొలగించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విశిష్ట అతిథి డీపీఎస్ రాజుతో పాటు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జి.వి. రావు, అమ్మయ్య చౌదరి, బాలన్న, శ్రీనివాసులు, మంగళంపల్లి మూర్తి, శ్రీనివాస్, కుర్రా మహేష్, బోయిన మహేష్ యాదవ్, శ్రీ చందన, ఉమా చంద్రశేఖర్, బాలాజీ, విష్ణుప్రసాద్, జిల్ మల్లేష్, రామారావు, బసవరాజు, చప్పిడి కృష్ణ, ఫహీమ్ పాల్గొన్నారు.

డ్రగ్స్ ముఠా గుట్టురట్టు.. !

- మాదాపూర్‌లో డ్రగ్ పెడ్లర్‌తో పాటు ఎనిమిది మంది వినియోగదారులు పట్టివేత

ఆదాబ్ సైబరాబాద్, సైబరాబాద్ : మాదాపూర్ పోలీసులు, ఎన్‌వోటీ కూకట్‌పల్లి సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక దాడిలో డ్రగ్స్ పంపిణీ, వినియోగ ముఠాను ఛేదించారు. మాదాపూర్ పరిధిలోని చంద్రనాయక్ తండాలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో డ్రగ్స్ విక్రయాలు, వినియోగం జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందరంతో జూన్ 13న పోలీసులు దాడి నిర్వహించారు. దాడిలో విజయవాడకు చెందిన ధనేకుల తరుణ్ తేజ (22) అనే యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి నిషేధిత మాదకద్రవ్యాలు, డ్రగ్స్ వినియోగానికి సంబంధించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో తాను డ్రగ్స్‌ను విజయవాడకు చెందిన పలువురి నుంచి తెప్పించి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు

నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువుల్లో 15 గ్రాముల ఎండీఎంఎ డ్రగ్, 382 గ్రాముల ఓజీ కుష్ గంజాయి, 9 మొబైల్ ఫోన్లు, 2 డిజిటల్ తూనిక యంత్రాలు, డ్రగ్స్ వినియోగం మరియు ప్యాకింగ్‌కు ఉపయోగించే సామగ్రి ఉన్నాయి. ఈ కేసులో విజయవాడకు చెందిన కార్తీక్, పృథ్వి అనే ఇద్దరు వ్యక్తులు ప్రధాన సరఫరాదారులుగా గుర్తించబడ్డారు. వీరు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, డ్రగ్స్ మూలాలను గుర్తించేందుకు దర్యాప్తు ముమ్మరం చేసినట్లు తెలిపారు. దాడి సమయంలో ఉద్యోగాల కోసం హైదరాబాద్‌కు వచ్చిన ఎనిమిది మంది యువకులు అపార్ట్‌మెంట్‌లో డ్రగ్స్ సేవిస్తున్నట్లు గుర్తించారు. వారు తరుణ్ తేజ వద్ద నుంచి ఎండీఎంఎ, ఓజీ కుష్ గంజాయి కొనుగోలు చేసి వినియోగిస్తున్నట్లు విచారణలో వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందని, డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్‌కు సంబంధించిన మరిన్ని వివరాలను సేకరిస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాదాపూర్ పోలీసులు ప్రజలకు, ముఖ్యంగా యువతకు, విద్యార్థులకు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల కార్యకలాపాలను గమనిస్తూ మాదకద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. డ్రగ్స్ విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే గోప్యంగా పోలీసులకు అందించాలని విజ్ఞప్తి చేశారు. కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్, ఎన్‌వోటీ డీసీపీ శోభన్ కుమార్ పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించబడింది. మాదాపూర్ పోలీసులు, ఎన్‌వోటీ కూకట్‌పల్లి సిబ్బంది సమన్వయంతో పనిచేసి డ్రగ్స్ ముఠాను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించారు.

ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా సేవా కార్యక్రమం

కేపీహెచ్‌బీ కాలనీలో బీపీ మిషన్ పునరుద్ధరణ

ఆదాబ్ సైబరాబాద్, కూకట్ పల్లి : ప్రజా సేవే లక్ష్యంగా, ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా కృషి చేస్తున్న సామాజిక సేవకుడు మందరపు సాయిబాబు చౌదరి మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. కేపీహెచ్‌బీ కాలనీలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పార్క్ వద్ద గతంలో శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్ సహకారంతో ఏర్పాటు చేసిన బీపీ మిషన్ పరికరం సాంకేతిక లోపాల కారణంగా గత ఏడాదిగా పనిచేయకుండా ఉండిపోయింది. దీంతో స్థానిక ప్రజలు ఉచితంగా రక్తపోటు పరీక్షలు చేసుకునే సౌకర్యాన్ని కోల్పోయారు. ప్రజల అవసరాన్ని గుర్తించిన మందరపు సాయిబాబు చౌదరి, శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్ యాజమాన్యంతో చర్చించి కొత్త బీపీ మిషన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి అదే ప్రదేశంలో తిరిగి ఏర్పాటు చేయించారు. దీంతో స్థానిక ప్రజలకు మరోసారి ఉచిత ఆరోగ్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ, ప్రజా సేవ అంటే మాటల్లో కాకుండా చేతల్లో చూపించేదేనని పేర్కొన్నారు. పనిచేయకుండా ఉన్న బీపీ మిషన్‌ను తిరిగి అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మందరపు సాయిబాబు చౌదరి ప్రజల ఆరోగ్యంపై చూపుతున్న శ్రద్ధకు ఇది నిదర్శనమని కొనియాడారు. నమాజానికి ఉపయోగపడే ప్రతి చిన్న పని కూడా గొప్ప సేవేనని, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ అవసరమైన చోట వెంటనే స్పందించడం మందరపు సాయిబాబు చౌదరి ప్రత్యేకత అని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రజా సంక్షేమం కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్న మందరపు సాయిబాబు చౌదరికి స్థానికులు అభినందనలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమానికి సహకరించిన శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆర్‌జీకే కాలనీలో ప్రజా సమస్యపై పాదయాత్ర నిర్వహించిన కొలన్ హన్మంత్ రెడ్డి

ఆదాబ్ సైబరాబాద్, కుత్బుల్లాపూర్ : నియోజకవర్గంలోని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో ఉన్న రాజీవ్ గృహకల్ప (ఆర్‌జీకే) కాలనీలో నెలకొన్న పలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమంలో కాలనీవాసులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పాదయాత్ర సందర్భంగా స్థానిక ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించిన హన్మంత్ రెడ్డి, కాలనీలో ప్రధానంగా తాగునీటి సమస్యతో పాటు చిరు వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆరా తీశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. కాలనీవాసులు ధైర్యంగా ఉండాలని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని తెలిపారు. తాగునీటి సమస్యలు, చిరు వ్యాపారుల ఇబ్బందులను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులతో సమన్వయం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి గణేష్, డీసీసీ అధికార ప్రతినిధి భారత్ గౌడ్, జిల్లా ఎస్సీ సెల్ వైర్మన్ కావలి చంద్రయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, కృష్ణ గౌడ్, రవీందర్, పిల్లి ఆంజనేయులు, బుచ్చిరెడ్డి, చంద్రశేఖర్, లక్ష్మణ్, శ్రీనివాస్, యువరాజ్, మహిళా నాయకులు కౌసల్య, చంద్రకళ, అనిత రెడ్డి, మాధవి రెడ్డి తదితరులు, కాలనీవాసులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాఠశాలల పునఃప్రారంభానికి సర్వం సిద్ధం

- తెలిపిన మండల విద్యాధికారి రవీందర్ రాజు
- పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీ పూర్తి
- మూడు పాఠశాలల్లో సీఎం బ్రేక్‌ఫాస్ట్, పాల పంపిణీ ప్రారంభం

ఆదాబ్ సైబరాబాద్, మేడ్చెల్ మల్కాజిగిరి : 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మండల విద్యాధికారి రవీందర్ రాజు తెలిపారు. సోమవారం నుంచి పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి విద్యా సంవత్సరానికి సంబంధించిన సన్నాహాలను సమీక్షించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపు స్తకాలు, నోట్ పుస్తకాలను పాఠశాల స్థాయి వరకు చేరదేసినట్లు తెలిపారు. జూన్ 15 నుంచి విద్యార్థులకు వాటిని పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వెల్లడించారు. ముఖ్యమంత్రి బ్రేక్‌ఫాస్ట్ మరియు పాల పంపిణీ కార్యక్రమం మొదటి దశలో భాగంగా కూకట్‌పల్లి మండలంలోని మూడు పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూకట్‌పల్లి, మండల ప్రాథమిక పాఠశాల కూకట్‌పల్లి బాలికలు, మండల ప్రాథమిక పాఠశాల కూకట్‌పల్లి బాలుర పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ అందజేయనున్నట్లు చెప్పారు. పాఠశాలల ఆవరణలు, తరగతి గదులు, మరుగుదొడ్లు, వంటశాలలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, తాగునీటి సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో విద్య అందించేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు మాత్రమే కాకుండా 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కూడా పల్స్‌లిక్స్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే కొత్త డిజైన్లతో రూపొందించిన యూనిఫామ్‌లను త్వరలో విద్యార్థులకు అందజేయనున్నట్లు వెల్లడించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే విద్యార్థుల నమోదు (ఎన్రోల్మెంట్) పెంపుతో పాటు వారి అభ్యసన సామర్థ్యాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు మండల విద్యాధికారి తెలిపారు. అదేవిధంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు సంబంధిత అనుమతులు లేకుండా పాఠశాలలు లేదా తరగతులను నిర్వహించరాదని హెచ్చరించారు. విద్యార్థుల భద్రత, వైట్ల్ సేఫ్టీ అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ విద్యా సంస్థలను నిర్వహించాలని ఆదేశించారు.

శ్రీ ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి



ఆదాబ్ సైబరాబాద్, కుత్బుల్లాపూర్ : నియోజకవర్గంలో తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ (టీపీఎంసీ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గంగుల అంజలి యాదవ్ నివాసంలో ఘనంగా నిర్వహించిన శ్రీ ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించిన కొలన్ హన్మంత్ రెడ్డి, నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారో గ్యాలతో, సుఖ్ఖంగా జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు. రాష్ట్రంలో ప్రజలకు శాంతి, సౌభాగ్యాలు చేకూరాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ, అమ్మవారి కృప ప్రతి కుటుంబంపై ఉండాలని, ప్రజల జీవితాల్లో ఆనందం, అభివృద్ధి నెలకొనాలని కోరుకున్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సామరస్యాన్ని పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళా నాయకులు, భక్తులు మరియు స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది.

EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL-MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com